సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం, 8, జూన్, 2023



న్యాయం జరిగేదెలా?

అతి తక్కువ ధరకు లక్షల విలువైన ప్లాట్లు వస్తాయని నమ్మి డబ్బు చెల్లించి మోసపోయిన బాధితులు తమకు న్యాయం జరిగేదెలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - 8లో



వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలు

మదనపల్లె నియోజకవర్గంలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డుప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.200	రూ.250
రెండోరకం	రూ.120	రూ.190



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1690 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	401	401
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 19.90 కిలోలు

న్యూస్‌రీల్

రేపు ఊటీకి ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ: వేసవి సెలవులు ముగింపు పురస్కరించుకుని 9న ఊటీకి ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు టు డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 9న రాత్రి 8 గంటలకు మదనపల్లె నుంచి బయలుదేరుతుందన్నారు. 11న ఊటీ నుంచి బయలుదేరి పైకా షూటింగ్ స్పాట్, ముదుమలై ఫారెస్టు, బండిపూర్ ఫారెస్టు మీదుగా మైసూర్‌కి వెళ్లి ప్యాలెస్, జూపార్కు, బృందావన్ గార్డెన్స్ చూసుకుని అదే రోజు రాత్రి బయలుదేరి 12న ఉదయం మదనపల్లెకు చేరుకుటుందన్నారు. మరిన్ని వివరాలకు 9959225677, 9160186645 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కొత్త విద్యా సంవత్సరానికి స్వాగతం పలుకుదాం



శ్రీరాం పురుషోత్తం, డీఈఓ

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో 2023–24 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల తరపున సంపూర్ణ స్వాగతం పలకాలని డీఈఓ పురుషోత్తం అన్నారు. బుధవారం డీఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి విషయంలో ఖర్చుకు వెనుకాడకుండా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. అలాగే వివిధ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వీటన్నిటికంటే ముఖ్యంగా ఈ నెల 14వ తేదీ లోపు నాడు – నేడు కార్యక్రమం ద్వారా పెండింగ్‌లో ఉన్న పనులన్నిటినీ పూర్తి చేయాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై ఉందన్నారు. ఈ ఏడాది సాధించిన ఫలితాల కంటే రానున్న విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలను సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు.

ఆన్‌లైన్‌లో భవన నిర్మాణ ప్రక్రియతో పారదర్శకత



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అనుడ వైస్ చైర్మన్ ఓ.వై.నందన్

రాయచోటి అర్బన్: భవన నిర్మాణ ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలోకి తీసుకురావడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అనుడ) వైస్ చైర్మన్ ఓ.వై.నందన్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రాయచోటి రెవెన్యూ డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు ఆన్‌లైన్ బిల్డింగ్ ప్లాన్ ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ విధానంతో భవన నిర్మాణానికి అవసరమైన అనుమతులు పొందే ప్రక్రియ సులభతరం అవుతుందన్నారు. పంచాయతీలలో అక్రమ నిర్మాణాలు, అనధికార లే అవుట్లపై పంచాయతీ కార్యదర్శులు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీఓలు కృష్ణసింగ్, ఆసిఫ్‌లు మాట్లాడారు.

బాధ్యతల స్వీకరణ



రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అబ్దుల్ కలీమ్

వాల్మీకిపురం: ఉర్దూ సాహిత్యం, భాషాభివృద్ధే కర్తవ్యం అని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. విజయవాడలోని ఉర్దూ అకాడమీ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ నదీమ్ అహ్మద్, డైరెక్టర్ సెక్రటరీ అయ్యూబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో బుధవారం ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు.

11న చదరంగం టోర్నమెంట్

కడప స్పోర్ట్స్: కడప నగరం మస్తాన్‌వలి వీధిలోని చదరంగం హాల్‌లో ఈనెల 11వ తేదీ ఉదయం 17వ అష్రఫ్–ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వివరాలకు 83412 55151 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

కడప అగ్రికల్చర్: కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 9వ తేదీన పుట్టగొడుగుల పెంపకంపై రైతులకు శిక్షణ కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. సంబంధిత శిక్షణ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు హాజరుకావచ్చని తెలిపారు.

పర్మినెంట్ ఆనందం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం వెలగపూడి సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాల పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ గ్యారంటీడ్ పెన్షన్ బిల్లు 2023 పేరుతో కొత్త పెన్షన్ విధానం అమలుకు నిర్ణయం, సీపీఎస్ ఉద్యోగుల కోసం సీపీఎస్ స్థానంలో ఏపీ జీపీఎస్ బిల్లు తేవడం, ప్రధానంగా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ఆమోదం తెలపడం, 12వ పీఆర్సీ ఏర్పాటుకు అంగీకారం తెలపడంపై ఉద్యోగ సంఘాలు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నాయి.

- ఏపీ కేబినెట్ నిర్ణయాలపై ఉద్యోగ సంఘాలు, పెన్షనర్లలో ఆనందోత్సాహాలు
- కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు కేబినెట్ ఆమోదంపై హర్షాతిరేకాలు
- కొత్త ఉద్యోగాల ప్రకటనతో నిరుద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు



రాయచోటి/మదనపల్లె సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఏపీ కేబినెట్ భేటీ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టు ఉద్యోగులలో ఫుల్ జోష్‌ను నింపింది. అలాగే వివిధ శాఖలలో కొత్త ఉద్యోగాల నియామకాలు చేపడతామన్న నిర్ణయం రాష్ట్రంలోని నిరుద్యోగ యువతలో మరింత ఆశలను రేకెత్తిస్తున్నాయి. పాదయాత్ర సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో ప్రధానమైన ఉద్యోగుల హామీలు అమలులోకి వస్తున్నాయి. దీంతో వారిలో నిన్నటి వరకు కనిపించిన నిర్లిప్తత, వ్యతిరేకత మాయమై చిరునవ్వులతో వెలిగిపోతున్నారు. బుధవారం ఉదయం ఏపీ కేబినెట్ నిర్ణయంతో ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుడ్ న్యూస్ చెప్పడమే వారిలో పండుగ వాతావరణాన్ని నింపింది. ఎన్నో సంవత్సరాలుగా పోరాటాలు చేస్తూ వస్తున్న ఉద్యోగులకు సంబంధించిన అనేక బిల్లులకు సానుకూలంగా నిర్ణయాలు రావడంతో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీపీఎస్ ఉద్యోగుల కోసం సీపీఎస్ స్థానంలో ఏపీ జీపీఎస్ బిల్లును తీసుకువచ్చింది. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 12వ పీఆర్సీ ఏర్పాటుకు చేయాలని నిర్ణయించడంతో నిన్నటి వరకు ప్రభుత్వంపై పెదవి విరుస్తూ వస్తున్న ఉద్యోగులు నేడు అదే ప్రభుత్వంపై ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ఆమోదం తెలపడంతో కాంట్రాక్టు ఉద్యోగులలో ఆనందం వెల్లివిరుస్తోంది. అలాగే ఏపీ గ్యారెంటీడ్ పెన్షన్ బిల్లు 2023 పేరుతో కొత్త పెన్షన్ విధానానికి ఆమోదం తెలపడంపై జిల్లాలోని పెన్షనర్లు జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు.

- 12వ పీఆర్సీ అమలుకు కేబినెట్ ఆమోదం తెలపడంతో రోడ్డెక్కి ఆందోళనలు చేసిన ఉద్యోగులు ప్రస్తుతం పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు అంటూ కొనియాడుతున్నారు. మొత్తం మీద బుధవారం నాటి కేబినెట్ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలు ఉద్యోగ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయనే చెప్పవచ్చు.

పీఆర్సీతో ఉద్యోగులకు న్యాయం



పీఆర్సీ ఏర్పాటు చేయడంతో ఉద్యోగులకు న్యాయం జరిగింది. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం అభినందనీయం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కింది. కో ఆపరేటివ్ సొసైటీల్లో సూపర్ న్యూమరీ పోస్టులకు ఆమోదం తెలపడం అభినందనీయం.

–నరసింహారెడ్డి, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు, మదనపల్లె

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ సాహసోపేత నిర్ణయం



అయిదు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం శుభ పరిణామం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా వీరి సర్వీసును రెగ్యులర్ చేయడం సాహసోపేత నిర్ణయం. ప్రభుత్వానికి రుణపడి ఉన్నాం.

–డి.మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



ఉద్యోగ సంఘాలతో మంత్రుల కమిటీ నిర్వహించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ప్రధానమైన ఆర్థిక అంశాలు, హామీలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవడం హర్షణీయం. రాష్ట్ర కేబినెట్‌లో న్యాయపరమైన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాము. 2018 జులై 1, 2019 జనవరి 1 కలిపి రెండు డీఏ అరియర్లు, సరెండర్ లీవు డబ్బులు ఈ ఏడాది సెప్టెంబర్‌లోగా చెల్లిస్తామని, అలాగే 2019 జులై 1, 2021 జులై 1 డీఏలు, పీఆర్సీ అరియర్లు కలిపి రూ.7370 కోట్లను రిటైర్మెంట్ తర్వాత ఇస్తామన్న ప్రభుత్వం తాజా చర్చల్లో 16 వాయిదాల్లో నాలుగేళ్లలో చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించడం మంచిది. 12వ పీఆర్సీ కమిషన్ నియామక నిర్ణయం, సీపీఎస్‌పై అందరికీ ఆమోదయోగ్యమైన విధంగా స్పష్టత ఇచ్చారు. ఉద్యోగ సంఘాలు చేపట్టిన సుదీర్ఘ ఉద్యమం కారణంగానే పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల అనేక ఆర్థిక/ఆర్థికేతర సమస్యలకు పరిష్కారం లభించింది.

– వై.శ్రీనివాసులురెడ్డి, అన్నమయ్య జిల్లా ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ నిర్ణయం హర్షణీయం



రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తీసుకున్న నిర్ణయం హర్షణీయం. వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు అన్ని ప్రభుత్వ శాఖలలో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయనుండటం సంతోషకరం. 2019 సంవత్సరంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.35 లక్షల ఉద్యోగాలకు అవకాశం కల్పించింది.

– వై.విశ్వనాథరెడ్డి, ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

కేబినెట్ సమావేశంలో ఉద్యోగులకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. సొసైటీలో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం, వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాల చెల్లింపు, నూతన జిల్లా కేంద్రంలో ఇంటిఅద్దె 12 శాతం నుంచి 16 శాతం వరకు పెంచడం హర్షణీయం.

– వై.ప్రసాద్ యాదవ్, ఏపీఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కె.బలరామరాజు, లక్కిరెడ్డిపల్లె అధ్యక్షుడు, ఎ.మల్లిరెడ్డి, కార్యదర్శి, సి.విశ్వనాథ్, ఎం.సురేంద్రరెడ్డి, ఎస్.దేవదానం ఉపాధ్యక్షులు

12వ పీఆర్సీ ఏర్పాటు సంతోషకరం



ఉద్యోగ ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ ఏర్పాటు చేసేందుకు మంత్రి వర్గం ఆమోదించడం హర్షణీయం. కమిషన్‌కు కాల వ్యవధి ఎక్కువగా విధించకుండా సకాలంలో అమలు చేస్తే ఉద్యోగ,ఉపాధ్యాయులు ప్రభుత్వానికి రుణపడి ఉంటారు. సకాలంలో పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయడం శుభ పరిణామం.

–మహమ్మద్‌ఖాన్, రూటా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మదనపల్లె

జలం ఒడిసి పడితేనే ప్రతిఫలం

- భూగర్భ జలాల పెంపునకు శాఖలన్నీ సమష్టిగా కృషి చేయాలి: జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్
- వ్యూహాత్మక ప్రణాళికతోనే భూగర్భ జలాల పెరుగుదల: జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ ప్రకాష్‌కిచి



జలశక్తి అభియాన్ కార్యక్రమ సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ గిరీషా పీఎస్, జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు, జేసీ

రాయచోటి : జలాన్ని ఒడిసి పడితేనే ప్రతిఫలం అని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అభిప్రాయపడ్డారు. బుధవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో అన్నమయ్య జిల్లాలో జలశక్తి అభియాన్ కింద చేపట్టిన కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ ప్రకాష్‌కిచి, కేంద్ర ప్రభుత్వ గ్రౌండ్ వాటర్ బోర్డు సైంటిస్ట్ అతర్వా పవార్‌లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అమలు చేస్తున్న జలశక్తి అభియాన్ ద్వారా నీటివనరుల సేకరణ, వాటర్ మేనేజ్‌మెంట్ సిస్టం, డ్రిప్ ఇరిగేషన్, వాటర్ కన్జర్వేషన్, ఫారంపాండ్‌లు, చెరువులు, చెక్‌డ్యామ్‌లు, అమృత్ సరోవర్ పథకం, నీటి ఆధారిత వ్యవసాయం, హార్టికల్చర్, నీటిపారుదల, నీటి నిర్వహణ తదితర జిల్లాలోని ప్రధాన కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ జలశక్తి అభియాన్ కేంద్ర బృందానికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అడుగంటిపోతున్న భూగర్భ జలాలను మెరుగుపరిచేందుకు అన్ని శాఖలు మరింత సమష్టిగా కృషి చేయాలన్నారు. నీటి సంరక్షణ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ ప్రకాష్‌కిచి, కేంద్ర ప్రభుత్వ గ్రౌండ్ వాటర్ బోర్డ్ సైంటిస్ట్ అతర్వా పవార్‌లు మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపుదలకు వ్యూహాత్మక ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ శివప్రసాద్, డ్వామా పీడీ మద్దిలేటి, ఇరిగేషన్ శాఖ జిల్లా అధికారి కృష్ణమూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్, మైక్రో ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుదలతోనే ఉపాధి లభ్యం



శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: యువతీ, యువకులు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా తమ నైపుణ్యాలను పెంపొందించుకొని ఉపాధి పొంది తమ కుటుంబానికి ఆసరాగా నిలవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. బుధవారం నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్స్, నియామకపత్రాలను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. యువతీ యువకులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం చూడకుండా సాంకేతిక విద్య ద్వారా ఉపాధి పొందేందుకు కృషి చేయాలన్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 30 మంది నిరుద్యోగ యువతీ, యువకులకు 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చినట్లు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ గణేష్ తెలిపారు. అలాగే 30 మందికి జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సులలో శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలకు తీపి కబురు

- ఉమ్మడి జిల్లాల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- మెరిట్ ప్రాతిపదికన నియామకాలు
- 14 నాటికి ఎంపిక ప్రక్రియ పూర్తి

ఉమ్మడి చిత్తూరు జిల్లా	
ప్రిన్సిపల్	3
పీజీటీ	61
సీఆర్టీ	31
పీఈటీ	03

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా	
ప్రిన్సిపల్	09
పీజీటీ	77
సీఆర్టీ	21
పీఈటీ	06



తంబళ్లపల్లెలోని కేజీబీవీ పాఠశాల

మదనపల్లె సిటీ: కార్పొరేట్‌కు దీటైన వసతులు.. అత్యుత్తమమైన విద్యా ప్రమాణాలు.. ఇంగ్లీషు మీడియంలో బోధన.. అనాథలైన, ఆర్థికంగా వెను బడిన, బడిమానేసిన, బడి బయట బాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయంలో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలను ప్రారంభించారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత మరో ముందడుగు వేసి పదోతరగతి వరకు ఉన్న కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ విద్యను ప్రవేశపెట్టారు. ఇప్పుడు ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసి కేజీబీవీలకు తీపి కబురు అందించారు. అయితే ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన నోటిఫికేషన్ ఇచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 20 కేజీబీవీలు, ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 29 కేజీబీవీలు ఉన్నాయి. వీటిల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 98 పోస్టులు, ఉమ్మడి వైస్సార్ జిల్లాలో 113 పోస్టులను భర్తీ చేయనున్నారు.

13న నియామక పత్రాలు జారీ

ఉమ్మడి వైఎస్సార్, చిత్తూరు జిల్లాల పరిధిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో ప్రిన్సిపల్, పీజీటీ, సీఆర్టీ, పీఈటీ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిపై భర్తీ చేయనున్నారు. ఎంపికైన వారికి 8,9 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. అనంతరం 10, 11, 12 తేదీల్లో నైపుణ్య పరీక్ష, పర్సనాలిటీ పరీక్ష నిర్వహించి, 12 వతేదీ తుది జాబితాను ప్రకటిస్తారు. ఉద్యోగాలు పొందిన వారికి 13న నియామక పత్రాలను జారీ చేయనున్నారు. ఈ పత్రాలను అందుకున్న వారు 14న విధుల్లో చేరాల్సి ఉంటుంది. పోస్టులన్నీ మహిళా అభ్యర్థులతో భర్తీ చేయనున్నారు.

మెరిట్ ప్రకారం పోస్టులు భర్తీ: కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ప్రిన్సిపల్, సీఆర్‌టీ, పీజీటీ, పీఈటీ పోస్టులను కేవలం మెరిట్ ప్రకారమే భర్తీ చేయనున్నారు. జిల్లా స్థాయి ఎంపిక కమిటీకి జేసీ చైర్మన్‌గా, ఉమ్మడి జిల్లా కేంద్ర సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ కన్వీనర్‌గా, డీఈఓ, జీసీడీఓ, ఓ సబ్జెక్టు నిపుణుడు సభ్యులుగా ఉంటారు. ప్రతి పోస్టుకు 100 మార్కులు ఉంటాయి. ప్రిన్సిపల్, పీజీటీ పోస్టులకు పదో తరగతిలో పది, ఇంటర్‌లో పది, డిగ్రీలో పది, పీజీలో వచ్చిన మార్కులకు 30 మార్కులు కేటాయిస్తారు. కేజీబీవీల్లో పని చేసే, చేసిన వారికి ఏడాదికి అర మార్కు, 10 ఏళ్లు పని చేసి ఉంటే 8 మార్కులు వెయిటేజ్ ఇస్తారు. నైపుణ్య పరీక్షలో కమ్యూనికేషన్ సామర్థ్యాలు, డెమో, నమూనా పాఠ్య బోధనలకు 15 మార్కులు ఉంటాయి. సీఆర్‌టీ పోస్టులకు సైతం టెన్త్‌లోని మార్కులకు 10, ఇంటర్‌లో పది, డిగ్రీలో 32, పీజీ 10 మార్కులు, బీఈడీలో 15 మార్కులు కేటాయిస్తారు. కేజీబీవీల్లో ఏడాది పని చేస్తే అర మార్కు, పదేళ్లు చేసి ఉంటే 8 మార్కులు, నైపుణ్య పరీక్షలో కమ్యూనికేషన్ సామర్థ్యాలు, డెమో, నమూనా పాఠ్యబోధనలకు 15 మార్కులు ఉంటాయి. పీఈటీ పోస్టులకు టెన్త్ మార్కులకు పది, ఇంటర్‌కు 20 మార్కులు, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో యూజీడీ మార్కులకు 32, బీపీఈడీకి 10, ఎంపీఈడీకి 5 మార్కులు కేటాయిస్తారు.

దళారులను నమ్మొద్దు



ఈనెల 14లోపు ఎంపిక ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పోస్టుల భర్తీ పారదర్శకంగా జరుగుతుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెరిట్ కమ్ రోస్టర్ ప్రాతిపదికన ఎంపికలుంటాయి. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు.

– పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి, జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్, చిత్తూరు జిల్లా

ఉపాధి పనులు కట్టుదిట్టంగా నిర్వహించండి



చిన్నఓరంపాడు ఉన్నత పాఠశాలలో నిర్మించిన ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఓబులవారిపల్లె : ఉపాధి హామీ పనులను కట్టుదిట్టంగా నిర్వహించాలని జలశక్తి అభియాన్ జాతీయ నోడల్ అధికారి ప్రకాశ్ కిచి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చిన్నఓరంపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధిహామీ పనులను కేంద్రం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు ఉపయోగకర ప్రాంతాలలో చేపట్టాలన్నారు. అనంతరం పాఠశాలలోఉపాధిహామీ పనులతో ఏర్పాటు చేసిన బోరుబావి ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి ఎ పవార్, జాయింట్ కమిషనర్ శివప్రసాద్, పీడీ మద్దిలేటి, ఏపీడీ ప్రతాప్, ఈసీ వెంకటేశ్వర్లు, టీఏలు శ్రీహరి, విశ్వనాథ్, రామాంజనేయులు, ఎఫ్ఏలు నవీన్, సురేంద్ర, వర్మ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులను కేంద్ర బృందం బుధవారం పరిశీలించింది. మండలంలోని చియ్యవరం చెరువు, మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీ కమిషనర్ శివప్రసాద్, పీడీ మద్దిలేటి, ఏపీడీ ప్రతాప్, జెడ్పీటీసీ రత్నమ్మ ఏపీఓ ఉమామహేశ్వర పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ విద్యార్థిపై దాడి


గాయపడిన నాగరాజ

మదనపల్లె : డిగ్రీ విద్యార్థిపై కొందరు యువకులు బీరుబాటిల్‌తో దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన బుధవారం పట్టణంలో జరిగింది. మండలంలోని పెంచుపాడు పంచాయతీ కట్టు బావికి చెందిన నాగరాజ(21) పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. బుధవారం కళాశాల పూర్తయిన తర్వాత నడచి వెళుతుండగా బసినికొండకు చెందిన నలుగురు యువకులు అతడిని అడ్డుకున్నారు. గతంలో వారి మధ్య ఉన్న వివాదాన్ని గుర్తు చేసుకుని నాగరాజతో గొడవకు దిగారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి యువకులు నాగరాజపై బీరు బాటిల్‌తో దాడిచేశారు. నాగరాజ తలపై తీవ్రగాయమైంది. రక్తం కారుతుండటంతో యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడిని స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితుడికి జైలు


నిందితుడిని జైలుకు తీసుకెళుతున్న పోలీసులు

రాజంపేట : మద్యం తాగి ఆటోను నడిపిన కేసులో రాజంపేట టౌన్ టి. అగ్రహారానికి చెందిన ఆటోడ్రైవర్ షేక్ ఫైజుల్లా అనే నిందితుడికి బుధవారం నాలుగు రోజులు జైలు శిక్ష విధించినట్లు నందలూరు మొదటి తరగతి మెజిస్ట్రేట్ శ్రీ లత వెల్లడించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అన్నమయ్య జిల్లా ఎస్పీ రెడ్డి గంగాధర్ ఆదేశాల మేరకు, రాజంపేట డీఎస్పీ వీఎన్‌కే. చైతన్య సూచనల మేరకు టౌన్ సీఐ ఎస్‌వీ నరసింహరాజు, ఎస్‌ఐ, సిబ్బంది 28 మే 2023 రాజంపేట ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా షేక్ ఫైజుల్లా మద్యం తాగి ఆటో డ్రైవింగ్ చేస్తుండగా అతనిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. బుధవారం నందలూరు కోర్టులో ఫైజుల్లాను హాజరు పరచగా మెజిస్ట్రేట్ శ్రీలత అతనికి నాలుగు రోజులు జైలుశిక్ష విధించింది. దీంతో పోలీసులు రాజంపేట జైలుకు తీసుకెళ్లారు.

టేకోవర్ ముసుగులో రుణం

- బ్యాంకును మోసగించిన మెప్మా సిబ్బందిపై కేసు
- గుట్టు రట్టవడంతో రూ.60.55లక్షల చెల్లింపు
- బ్యాంక్‌మేనేజర్ ఫిర్యాదుతో సీఓ, ఆర్పీలపై కేసు


మదనపల్లెలోని మెప్మా కార్యాలయం

మదనపల్లె : నకిలీ స్వయం సహాయక సంఘాల పేరుతో బ్యాంకులో రూ.1 కోటి45లక్షల రుణం తీసుకుని స్వాహా చేసిన ఘటనలో మెప్మా సిబ్బందిపై బుధవారం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్ మేనేజర్ అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు బ్యాంకు సొమ్మును స్వాహా చేసిన మెప్మా సీఓ, ఆర్పీ, ఓటీలపై కేసు నమోదుచేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని అమ్మచెరువుమిట్ట, చంద్రాకాలనీ, అనపగుట్ట తదితర ప్రాంతాల్లోని పేద మహిళలను ఎంపిక చేసుకుని వారి నుంచి మెప్మా సీఓ రవి కుమార్, ఆర్పీలు జ్యోతి, నాగరాణి, పద్మ, ఓటీ మంజులలు ఆధార్‌కార్డులు సేకరించి మెప్మా ఆధ్వర్యంలో రుణాలు ఇప్పిస్తామని నమ్మించారు. ముందుగా వీరికి నమ్మకం కలిగే విధంగా ఒకొక్కరికి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు నగదు ఇచ్చారు. వీరి నుంచి సేకరించిన ఆధార్ కార్డులతో 8 సంఘాలను ఏర్పాటుచేశారు. మెప్మా సీఓ రవికుమార్ కీలకంగా వ్యవహరించి ఉద్దేశపూర్వకంగా బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్‌ను కలిసి వేరే బ్యాంకు నుంచి కొన్ని సంఘాలను టేకోవర్ చేసుకుని రుణాలు ఇవ్వాలని కోరాడు. వాస్తవానికి ముందు బ్యాంకులో ఖాతాలున్న సంఘాలు ఇదివరకు తీసుకున్న రుణాలను పూర్తిస్థాయిలో చెల్లించి ఉంటేనే వేరే బ్యాంకు టేకోవర్ చేసుకుని రుణాలు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే సీఓ ముందు బ్యాంకులో 3 సంఘాలను తీసుకుని, వాటికి మరో 5 సంఘాలను జోడించి పూర్తిస్థాయిలో డాక్యుమెంటేషన్ చేసి మొత్తం 8 సంఘాల వివరాలను బ్యాంకు మేనేజర్‌కు అందించాడు. దీంతో మేనేజర్ 8 సంఘాల సభ్యులను పిలిచి వారి ఆధార్‌కార్డుల ఆధారంగా విచారణ చేసి గ్రూపుల వారీగా నగదును వారి ఖాతాల్లో జమచేశారు. వాటిలో గంగాభవానీ ఎంపీఎస్ రూ.10లక్షలు, ఉషోదయం ఎంపీఎస్ రూ.15లక్షలు, అనిరుధ్ ఎస్‌హెచ్‌జీ రూ.20లక్షలు, సమృద్ధి ఎంపీఎస్ రూ.20లక్షలు, లక్ష్మీ వెంకటేశ్వర ఎంపీఎస్ రూ.20లక్షలు, రోష్ని ఎంపీఎస్ రూ.20లక్షలు, మహేశ్వరి ఎంపీఎస్ రూ.20లక్షలు, మహామారెమ్మ ఎస్‌హెచ్‌జీ రూ.20లక్షల చొప్పున మొత్తం రూ. కోటి45లక్షల వరకు రుణాలను తీసుకున్నారు. తర్వాత సీఓ, ఆర్పీలు కలిసి బ్యాంకు సభ్యుల ఖాతాల్లో జమచేసిన నగదును తీసుకున్నారు. టేకోవర్ చేసుకున్న గ్రూపులకు సంబంధించి క్లియరెన్స్ సర్టిఫికెట్ రాకపోవడంతో బ్యాంక్ మేనేజర్ గతంలో సభ్యులు లోను తీసుకున్న బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదిస్తే తన బ్యాంకులో ఆ సంఘాల పేరుతో లోను పూర్తి కాలేదన్నారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బ్యాంక్ మేనేజర్ సభ్యులను, మెప్మా సిబ్బందిని పిలిచి విచారించారు. దీంతో తమ తప్పును ఒప్పుకుని, బయటకు ఈ విషయం తెలిస్తే తమ ఉద్యోగాలు పోతాయని బతిమలాడి తీసుకున్న డబ్బులు చెల్లించేలా మేనేజర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. అందులో అతికష్టం మీద రూ.60,55,772 చెల్లించారు. మిగిలిన మొత్తం తాము వాడేసుకున్నామని, సమయం ఇస్తే చెల్లిస్తామని చెప్పడంతో చేసేదిలేక బ్యాంక్ మేనేజర్ పోలీసులను ఆశ్రయించాడు. నకిలీ సంఘాల పేరుతో తన బ్యాంకులో తీసుకున్న లోనుకు సంబంధించి రూ.84లక్షల 44వేల 228 రూపాయలు రావాల్సి ఉందని, మెప్మా సిబ్బందిపై కేసు నమోదుచేయాల్సిందిగా కోరాడు. ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన మెప్మా సీఓ రవి గతంలో చిత్తూరు, పుంగనూరు పట్టణాల్లో పనిచేసే సమయంలోనూ అక్కడ లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డాడు. అయినప్పటికీ అతడిపై చర్యలు తీసుకోవడంలో మెప్మా ఉన్నతాధికారులు నిర్లక్ష్యం కనపరచడంతో మదనపల్లెలోనూ తన చేతివాటం ప్రదర్శించాడు. మరో 8 మహిళా సంఘాల సభ్యులపై కేసు నమోదు చేశారు.

న్యాయం జరిగేదెలా?

- ప్లాట్ల పేరుతో రూ.20 లక్షలకుపైనే వసూలు
- ఆదుకునేదెవరని దిక్కులు చూస్తున్న పేదలు



పేదలకు ఓబులేశు రాసిచ్చిన అగ్రిమెంటు

బి.కొత్తకోట : అతి తక్కువ ధరకు లక్షల విలువైన ప్లాట్లు వస్తాయని నమ్మి డబ్బు చెల్లించి మోసపోయిన బాధితులు తమకు న్యాయం జరిగేదెలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బి.కొత్తకోట కరెంట్‌కాలనీకి చెందిన డేరంగుల పెద్ద ఓబులేశును పోలీసులు అరెస్ట్ చేయడంతో ప్లాట్ల మోసం జరిగిందని బాధితులు గుర్తించారు. ఓబులేశు బీరంగిరోడ్డులోని విలువైన తన సొంత భూముల్లో పేదలకు ఇళ్లస్థలాలను తక్కువ ధరకు విక్రయిస్తానని నమ్మించారు. ఒక్కొక్కరి నుంచి రూ.3 వేల నుంచి రూ.25 వరకు వసూలు చేసినట్టు పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది. తీసుకున్న డబ్బుకు బాండుకాగితాలపై ఓబులేశు ప్లాట్ల హద్దులు వేసి రాసిచ్చాడు. ఇలా అగ్రిమెంటు చేసి ఇవ్వడంతో పేదలు నమ్మి అధికసంఖ్యలో డబ్బు చెల్లించి అగ్రిమెంట్లు చేయించుకున్నారు. ఇటీవల పేదలకు ప్లాట్లు వేసి ఇస్తానని చెప్పిన భూమి ఓబులేశుకు చెందినది కాదని తెలిపోవడం, భూ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో పోలీసుల దృష్టికి వచ్చిన మేరకు 260 మందికిపైగా పేదలకు డబ్బు చెల్లించారు. వీరినుంచి రూ.20లక్షలకు పైబడి వసూలైనట్టు భావిస్తున్నారు. బాధితులు ఇప్పుడు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ప్లాట్లు కేటాయిస్తూ చేసుకున్న అగ్రిమెంట్లు పక్కాగా ఉన్నాయి. ప్లాట్లు ఇస్తానని చెప్పిన భూమి ఓబులేశుది కాదని తెలిపోయింది. డబ్బు చెల్లించి అగ్రిమెంట్లు చేసుకొన్న వారిలో అత్యధికులు నిరుపేదలు ఉన్నారు. వీరంతా ప్లాట్ల కోసం ఆశపడి డబ్బు చెల్లించారు. ప్లాటు రాకపోగా ఈ పరిస్థితుల్లో ఇచ్చిన డబ్బు తిరిగి వస్తుందో లేదో అన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మోసగాళ్ల చిట్టా తీస్తున్నాం

ఓబులేశుకు డబ్బు చెల్లించి మోసపోయిన బాధితులు తమను ఆశ్రయిస్తే న్యాయం చేస్తామని ఎస్‌ఐ కే.రామమోహన్ చెప్పారు. ఓబులేశు తరహాలో ప్లాట్లు, భూమోసాలకు పాల్పడుతున్న వ్యక్తుల వివరాలు, సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నామని చెప్పారు.

వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలు


గాయపడిన భాస్కరనాయుడు

మదనపల్లె : వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. చౌడేపల్లె మండలం దిగువపల్లె పంచాయతీ బోయకొండ భవానీనగర్‌కు చెందిన ఏ.భాస్కరనాయుడు(42) బోయకొండ ఆలయం వద్ద వంట మనిషిగా పనిచేస్తుంటాడు. బుధవారం తన స్నేహితుడైన కొలిమిపల్లె శ్రీనివాసులు(43)తో కలిసి ద్విచక్రవాహనంలో దిగువపల్లె నుంచి బోయకొండ పైకి వెళుతుండగా కొండపై నుంచి కిందకు వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో భాస్కరనాయుడు, శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను స్థానికులు, కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా మదనపల్లె పట్టణంలోని చెంబకూరురోడ్డులో ఉంటున్న రామాంజనేయులు(41) కొలిమి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం చిప్పిలి గంగజాతరకు ద్విచక్రవాహనంలో వెళ్లాడు. తిరిగి వస్తుండగా మార్గమధ్యలోని శివనగర్ అయ్యప్పస్వామి గుడి వద్ద వాహనానికి కుక్క అడ్డుగా రావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఓ వివాహిత, ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కురబలకోట మండలం చింతమాకులపల్లెకు చెందిన జ్యోతి(25) కుటుంబసమస్యలతో బుధవారం ఉదయం ఇంట్లో నిద్రమాత్రలు మింగింది. అపస్మారక స్థితిలో ఉన్న బాధితురాలిని గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా తంబళ్లపల్లెకు చెందిన మైనర్ బాలిక(15) మంగళవారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి కలకడ మండలం కదిరాయచెరువులోని బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడ మైనర్ బాలిక సెల్‌ఫోన్ చూస్తుండగా తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన బాలిక చేతిలోని గాజులు పగులగొట్టుకుని, వాటిని మింగింది. కుటుంబసభ్యులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

హౌస్ మెయిడ్ మహిళలకు అగ్రిమెంట్ తప్పనిసరి


మాట్లాడుతున్న ఏపీఎన్‌ఆర్‌టీఎస్ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్

కడప కార్పొరేషన్ : కువైట్‌కు కొత్తగా వచ్చే హౌస్ మెయిడ్ మహిళలకు భారత రాయబార కార్యాలయ అగ్రిమెంట్ తప్పనిసరి అని ఏపీఎన్‌ఆర్‌టీఎస్ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్ పేర్కొన్నారు. కువైట్‌లోని షాహిల్ ప్రాంతంలో కువైట్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న హౌస్ మెయిడ్ ఆఫీసుల సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో పీసీపీ కొరకు దరఖాస్తు చేసుకుంటే ఎంబసీ అగ్రిమెంట్ తప్పనిసరి అని లేకపోతే పీసీపీ వచ్చేది కాదన్నారు. దానివల్ల ఒక నెల సమయం వృథా అయ్యేదన్నారు. హౌస్ మెయిడ్ వచ్చేదానికి అలస్యమైతే వీసా ఇచ్చిన కువైటీలు కొట్లాడేవారన్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చి అగ్రిమెంట్ పేపర్, వీసా లేకపోయినా కేవలం పాస్‌పోర్టు ఉంటే పీసీపీకి దరఖాస్తు చేసుకునేలా ఏపీఎన్‌ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్ కృషి చేశారన్నారు. రాష్ట్రం నుంచి కువైట్‌కు తీసుకొచ్చే మహిళల వద్ద వీసా కొరకుగానీ, టికెట్‌కుగానీ దారి ఖర్చులతో సహా తామే భరిస్తున్నామన్నారు. నయాపైసా వారి వద్దనుంచి తీసుకోమని.. ప్రతి ఒక్కరికీ ఎంబసీ అగ్రిమెంట్ తీసుకుంటామని తెలిపారు. కువైట్‌కు రావాలనుకొని వీసాకు రూ.35,400 చెల్లించి, తర్వాత కొన్ని కారణాల వల్ల మెడికల్ ఫెయిల్ అయి రాలేని మహిళల డబ్బులు తిరిగి ఇచ్చేలా ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ఎం. బాలిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ఏపీఎన్‌ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, సీఈఓ హేమలత సలహాలు, సూచనల మేరకు ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఏవైనా సమస్యలుంటే ఏపీఎన్‌ఆర్‌టీఎస్ హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ ప్రవాసాంధ్ర భరోసా బీమా నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కువైట్ కో కన్వీనర్ గోవిందు నాగరాజు, సలహాదారు ఎన్. చంద్రశేఖర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు షేక్ రహమతుల్లా, ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ప్రొవిజినల్ కో ఆర్డినేటర్లు లక్ష్మిప్రసాద్, ఎన్వీ సుబ్బారెడ్డి, హౌస్ మెయిడ్ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ కనెక్షన్లకు ప్రాధాన్యత

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు



మాట్లాడుతున్న సీఎండీ సంతోష్‌రావు

ప్రొద్దుటూరు క్రైం : వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు తెలిపారు. రైతులు డిపాజిట్ కట్టిన వెంటనే నెల రోజుల్లోగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని చెప్పారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు డివిజన్‌లోని కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గాలకు సంబంధించి వివిధ అంశాలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన డీపీటీ అకౌంట్స్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పదే పదే జరుగుతున్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్‌ను తగ్గించాలని చెప్పారు. 33 కేవీ, 11 కేవీ ఫీడర్లలో అంతరాయాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే విద్యుత్ బకాయిలను వసూలు చేయుటకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్ ఫీడర్లలో నష్టాలు తగ్గించాలన్నారు. విద్యుత్ చౌర్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికారులు వారికి కేటాయించిన హెడ్ క్వార్టర్స్‌లో నివాసముంటూ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలని సీఎండీ సూచించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ శ్రీనివాసులు, ప్రొద్దుటూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసులరెడ్డి, డీఈలు, ఏఈలు, సీనియర్ అకౌంట్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిల వసూలుపై దృష్టి సారించాలి

మైదుకూరు : మైదుకూరు డివిజన్ పరిధిలో విద్యుత్ బకాయిలు పేరకపోయాయని, వాటి వసూలుపై దృష్టి సారించాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్ తెలిపారు. బుధవారం మైదుకూరులోని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, దువ్వూరు, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు, బద్వేలు, గోపవరం, బ్రహ్మంగారిమఠం, అట్లూరు మండలాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులు కేటాయించిన ప్రదేశాల్లో ఉంటూ పనిచేస్తే అత్యుత్తమ ఫలితాలు వస్తాయన్నారు. ప్రతి ఉద్యోగి కేటాయించిన ప్రాంతాల్లో ఉండాలని ఆదేశించారు. ఇకపై తరచూ పరిశీలనకు వస్తానని, పనులు చేయని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మజ్ఞాని, గురవయ్య, ఓఎస్‌డీ ఎస్.శ్రీనివాసులు, ఎస్‌ఈ ఎస్.రమణ, అకౌంట్ ఆఫీసర్ మధు, మైదుకూరు డివిజన్ ఈఈ జీవీ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక వైద్యశాలకు 116 పోస్టులు మంజూరు

కడప అర్బన్ : రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవను తీసుకుని వైఎస్సార్ జిల్లా కడపలోని 100 పడకల మానసిక వైద్యశాల నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని, అందులో వైద్యులు, ఇతర పరిపాలన సిబ్బంది విధులను నిర్వహించేందుకు 116 పోస్టులను మాంజూరు చేశారు. వాటి భర్తీకి కేబినెట్ ఆమోదం తెలియజేసింది. ఈ సందర్భంగా రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, మానసిక వైద్య విభాగం సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరాముడు, వైద్యులు, వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే 100 పడకల సామర్థ్యంతో రూ. 40- 45 కోట్ల వ్యయంతో మానసిక వైద్యశాల నిర్మాణంను పూర్తి చేశారు. త్వరలో హాస్పిటల్ ప్రారంభానికి సిద్ధమవుతోందన్నారు. మానసిక వైద్యశాల నిర్మాణానికి, అందుబాటులోకి రావడానికి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్‌బి అంజాద్‌బాషాకు, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి, జిల్లాలోని ఎమ్మెల్యేలకు, జిల్లా అధికారులకు డాక్టర్ వెంకటరాముడు, వైద్య సిబ్బంది కృతజ్ఞతలను తెలియజేశారు.

లోకేష్ పాదయాత్రలో గుడ్లు విసిరిన ఇద్దరు వ్యక్తుల అరెస్ట్


అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : నారాలోకేష్ యువగళం పాదయాత్రలో కోడిగుడ్లు విసిరిన ఇద్దరిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ బుధవారం రాత్రి మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. పెన్నానగర్‌కు చెందిన ఇంటి బాబు, శ్రీకాంత్‌లు స్నేహితులు. ఇద్దరు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రొద్దుటూరులో ఈ నెల 1న సాయంత్రం చౌటపల్లె విడిది కేంద్రం నుంచి రెండో రోజు నారాలోకేష్ పాదయాత్ర ప్రారంభమైంది. ప్రారంభం నుంచి పాదయాత్ర వెంట నడిచిన బాబు బొల్లవరంలోకి రాగానే లోకేష్‌తో సెల్ఫీ తీసుకునేందుకు వెళ్లగా వలంటీర్లు అతన్ని తోసేశారు. చేసేదేమి లేక అతను నిరాశతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అలాగే వన్‌టౌన్ సమీపంలోని ఉమేష్‌చంద్ర సర్కిల్ వద్దకు లోకేష్ వచ్చిన వెంటనే సెల్ఫీ తీసుకునేందుకు శ్రీకాంత్ భార్యా పిల్లలతో కలిసి వెళ్లాడు. అయితే వారిని కూడా రోప్ పార్టీ వలంటీర్లు పక్కకు నెట్టేశారు. ఈ క్రమంలో కొద్ది సేపటి తర్వాత శ్రీకాంత్ బాబుకు ఫోన్ చేయడంతో ఇద్దరు కలిసి ఎర్రగుంట్ల రోడ్డులోని నంగనూరుపల్లె క్రాస్ వద్దకు వెళ్లారు. అక్కడ ఇద్దరు సెల్‌ఫోన్లో లైవ్‌లో లోకేష్ పాదయాత్రను వీక్షిస్తూ మద్యం సేవించారు. నారాలోకేష్ తమకు సెల్ఫీ తీసుకోవడానికి అవకాశం ఇవ్వలేదని ఇద్దరూ తమ ఆవేదనను ఒకరికొకరు పంచుకున్నారు. అక్కడి నుంచి శ్రీకాంత్, బాబులు రిలయెన్స్ పెట్రోల్ బంకు వద్దకు వెళ్లారు. సమీపంలోని దుకాణంలో శ్రీకాంత్ మూడు గుడ్లు, బాబు రెండు గుడ్లను కొనుగోలు చేశారు. కొంత సేపటి తర్వాత లోకేష్ పాదయాత్ర అక్కడికి రాగానే ఇరువురు గుడ్లు విసిరారు. దీంతో వారిద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. కావాలని వాళ్లే గుడ్లు విసిరారా లేక ఇతరుల ప్రోద్బలంతో గుడ్లను విసిరారనే దానిపై విచారణ చేస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ ఇబ్రహీం, రూరల్ ఎస్‌ఐలు చిరంజీవి, శివప్రసాద్ పాల్గొన్నారు.

మినీ బస్సు బోల్తా : ఆరుగురికి గాయాలు


ప్రమాదానికి గురైన బస్సులో నుంచి ప్రయాణికులను బయటకు తీస్తున్న స్థానికులు

దువ్వూరు : వైఎస్సార్‌జిల్లా గుడిపాడు గ్రామం వద్ద బుధవారం జాతీయ రహదారిపై మినీ బస్సు బోల్తా పడటంతో ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మినీ బస్సులో 20 మంది హైదరాబాద్ నుంచి కాణిపాకం వెళుతుంగా గుడిపాడు గ్రామ సమీపానికి రాగానే అదుపు తప్పి జాతీయ రహదారి పక్కనున్న పొలాల్లో బోల్తా పడింది. సమీపంలోని గోడౌన్‌లో పనిచేస్తున్న కూలీలు గమనించి బస్సులోని ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

కుమారుడిని రక్షించబోయి తండ్రి మృతి


మూడే గోపాల్‌నాయక్ మృతదేహం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : విద్యుత్ తీగలకు తగులుకున్న కుమారుడిని తప్పించబోయి తండ్రి మృతి చెందిన సంఘటన వైఎస్ఆర్ జిల్లా మైలవరం మండలంలో చోటు చేసుకొంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొన అనంతపురం గ్రామానికి చెందిన మూడే గోపాల్ నాయక్ ఇంటిపై దుస్తులు ఆరేసేందుకు తంతెను ఏర్పాటుచేశారు. 12 సంవత్సరాల వయస్సు కలిగిన కుమారుడు మూడే రమేష్ నాయక్ దుస్తులు తీసుకొచ్చేందుకు ఇంటిపైకి వెళ్లాడు. అయితే పక్కనున్న విద్యుత్ బల్బు కోసం ఏర్పాటుచేసిన తీగలు ప్రమాదవశాత్తు రమేష్‌నాయక్ కు తగిలాయి. గమనించిన మూడే గోపాల్ నాయక్ కుమారుడిని తప్పించాడు. అయితే తీగలు మూడే గోపాల్ నాయక్ తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బంధువులు జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతనికి భార్య దేవి. ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి ఆసుపత్రికి వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

అరటి ఉప ఉత్పత్తుల కేంద్రం పరిశీలన


అరటి ఉప ఉత్పత్తుల కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న రమేష్

పులివెందుల రూరల్ : వైఎస్సార్‌జిల్లా పులివెందులలోని బ్రాహ్మణపల్లె రెవెన్యూ పరిధిలో నిర్మిస్తున్న అరటి ఉప ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని బుధవారం ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ డిప్యూటీ సీఈఓ, ఏపీఎంఐపీ ఓఎస్డీ రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరటి ఉప ఉత్పత్తుల కేంద్రం నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్, టెక్నికల్ ఆఫీసర్లకు సూచించారు తేనేలో మంచిన అరటి, అరటి క్యాండీ, అరటి పొడి, అరటి ప్లేట్లు, అరటి కాండం నుండి తీసిన నార తదితర ఉత్పత్తులను తయారు చేస్తామని తెలియజేశారు. అక్కడ ఏర్పాటు చేసిన అరటి కాయలను శుభ్రపరిచి, గ్రేడింగ్, ప్యాకింగ్ చేసే యంత్రాన్ని, సోలార్ డ్రయర్‌ను పరిశీలించారు. అలాగే 2022-23 ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసిన డ్రిప్ పరికరాలను క్షేత్రస్థాయిలో అమర్చుకున్న రైతుల పొలాలను పరిశీలించారు. అనంతరం నల్లపురెడ్డిపల్లె రైతు భరోసా కేంద్రంలో ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి, ఏపీడీ మురళీమోహన్‌రెడ్డిలు రైతులతో డ్రిప్ పరికరాల మీద ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎంఐపీ ఓఎస్డీ రమేష్ మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాకు 10,500హెక్టార్లలో బిందు, తుంపర సేద్య పరికరాల ఏర్పాటు కోసం ఈ ఏడాది అనుమతులు ఇచ్చామని.. ఆసక్తిగల రైతులు ఆయా ఆర్‌బీకేలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ ఈడీ, జిల్లా ఉద్యాన శాఖాధికారి మైఖేల్ రాజీవ్, హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి, ఏఓ చంద్ర తదితరులు పాల్గొన్నారు.